రేవంత్ తమ్ముడిపై అరెస్టు వారెంట్?

- న్యూజెర్సీ సుపీరియర్ కోర్టు జారీ
- 58,500 డాలర్లు అప్పు తీసుకొని తిరిగి ఇవ్వలేదని బాధితుడు డేవిడ్ ఆరోపణ

కొండల్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ్ముడు ఎనుముల కొండల్‌రెడ్డిపై అమెరికా కోర్టు వారెంట్ జారీ చేసినట్టు తెలిసింది. కొండల్‌రెడ్డి దంపతులు ప్రవాస భారతీయుడి నుంచి అప్పు తీసుకొని తిరిగి చెల్లించకపోవడంతో, సదరు ఎన్నారై కోర్టును ఆశ్రయించగా, కొండల్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదైనట్టు సమాచారం. ఇదంతా నిజమేనని బాధితుడు డేవిడ్ ఒక యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. వివరాలు బాధితుడి మాటల్లోనే.. '1972లో అమెరికాకు వచ్చి ఇక్కడే స్థిరపడ్డాను. నా మేనల్లుడు రఘోత్తంకు ఎరుపుల కన్సల్టింగ్ సంస్థ ద్వారా కొండల్‌రెడ్డి పరిచమయ్యారు. రఘోత్తం, కొండల్‌రెడ్డి కలిసి కొంతకాలం కన్సల్టింగ్ సంస్థను నడిపారు. మనస్పర్థలు, వివాదాల కారణంగా విడిపోయారు. సొంతంగా బిజినెస్ పెడతామంటూ కొండల్‌రెడ్డి దంపతులు డబ్బుల కోసం నన్ను సంప్రదించారు. వారిపై సానుభూతితో 58,500 అమెరికా డాలర్లు ఇచ్చాను. వారిచ్చిన చెక్కులు బౌన్స్ అయ్యాయి. దాంతో ఆధారాలతోసహా న్యూజెర్సీ సుపీరియర్ కోర్టులో కొండల్‌రెడ్డిపై క్రిమినల్ కేసు ఫైల్ చేశాను. విచారణ జరిపిన కోర్టు కొండల్‌రెడ్డికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. అరెస్టు వారెంట్ కూడా జారీచేసింది. కొండల్‌రెడ్డి అమెరికాను విడిచి వెళ్లడంతో నాటినుంచి ఆయన ఆచూకీ కోసం పోలీసులు వెతుకుతున్నారు. ఒకవేళ కొండల్‌రెడ్డి అమెరికాకు వస్తే నేర చరిత్ర ఆధారంగా పోలీసులు అతడిని అరెస్టు చేస్తారు' అని పేర్కొన్నారు. కొండల్‌రెడ్డి తన దగ్గర అప్పు తీసుకున్నట్టు ఉన్న చెక్స్, ప్రామిసరి నోటు, కోర్టు తీర్పులు, ఇతర ఆధారాలు ఇవేనంటూ అంటూ వాటిని మీడియా చూపించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వానిదే బాధ్యత

- డిజైన్, నిర్మాణ లోపం వల్లనే సైడ్‌వాల్ కూలింది
- సుంకిశాల ఘటనపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- శాఖ తనది కానందున అవగాహన లేదని వ్యాఖ్య

నల్లగొండ ప్రతినిధి, ఆగష్టు 9 (నమస్తే తెలంగాణ): సుంకిశాలలో జరిగిన ఘటనకు గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే బాధ్యత అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. డిజైన్ లోపమో లేక నిర్మాణ లోపం వల్లనో సైడ్‌వాల్ కూలిపోయిందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలోనే డిజైన్‌ను ఫైనలైజ్ చేసి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారని, రిటైనింగ్ వాల్ నిర్మాణం కూడా అప్పుడే జరిగిందని అందువల్ల ఆ ఘటనకు గత ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని పేర్కొన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పురపాలక మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సుంకిశాల పర్యటనకు వచ్చిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనంతరం మీడియాతో మాట్లాడారు. గడిచిన తొమ్మిది నెలల్లో సుంకిశాల పనులపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్ష చేసిందనే తాను భావిస్తున్నానని చెప్పారు. తాను పురపాలక శాఖ మంత్రిని కానందున ఈ పథకంపై అవగాహన లేదని స్పష్టంచేశారు. అంతకుముందు మీడియాతో మాట్లాడిన ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్, ఇంజినీర్లు, ఇతర అధికారులు ప్రాజెక్టు మంచి ఉద్దేశంతో చేపట్టారని స్పష్టం చేశారు. 'ఆల్మట్టి, జూరాల గేట్లు ఎత్తారు, వరద వస్తుందని తెలుసు, అయినా టన్నెల్ ఎందుకు తెరిచారు అని మంత్రి తుమ్మల ప్రశ్నించగా.. తాము గేట్లు మూసే ఉంచామని, అన్ని జాగ్రత్తలు తీసుకున్నా వరద తీవ్రతకు గేట్లు కొట్టుకుపోయాయని ఇంజినీర్లు చెప్పారు.

ఈ సందర్భంగా మీడియా ప్రశ్నలకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించారు.

మీడియా: ఈ ఘటనను గోప్యంగా ఉంచారన్న ఆరోపణలకు ఏమంటారు?

ఉత్తమ్: గోప్యంగా ఉంచారని అనుకోను. ఇంజినీర్ల లెవల్‌లో వాళ్లు డీల్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఆరో తేదీనో తర్వాతనో వచ్చాక ఇది ప్రభుత్వం దృష్టికి వచ్చింది. వెంటనే చర్యలు తీసుకున్నం. రిటైనింగ్ వాల్ పడిపోవడంపై ఏజెన్సీ వాళ్లు పునఃనిర్మాణం చేస్తామని చెప్పారు.

మీడియా: తొందరగా పనులు చేయాలని మీరు అధికారుల మీద ఒత్తిడి తేవడం వల్లనే ఇలా జరిగిందన్న ఆరోపణలున్నాయి.?

ఉత్తమ్: ఇవన్నీ లేనిపోని మాటలు. ఎవ్వరూ ఎవ్వరి మీద ఒత్తిడి తేలేదు. నార్మల్ కోర్స్‌లోనే పనులు జరుగుతున్నాయి.

మీడియా: జరిగిన ఘటనపై విచారణ జరుగుతుందా?

ఉత్తమ్: తప్పనిసరిగా విచారణ జరుగుతుంది. వాటర్‌వర్క్స్ వాళ్ల లెవల్‌లో ఎంక్వైరీ చేస్తున్నారు. సీఎంతో చర్చించి ప్రభుత్వం తరపున కూడా ఒక ఉన్నతస్థాయి కమిటీ వేసి ఎంక్వైరీ చేస్తం.

మీడియా : కాంట్రాక్టు సంస్థది తప్పని తేలితే బ్లాక్‌లిస్టులో పెడతారా?

ఉత్తమ్: విచారణ రిపోర్టు ఆధారంగా ప్రభుత్వం ఆలోచిస్తుది. ఎంక్వైరీ కానివ్వండి... అయ్యాక మాట్లాడుతాం.

మీడియా : గత ప్రభుత్వ వైఫల్యం అని భట్టి విక్రమార్క ఇప్పుడు మీరు అంటున్నారు? జలమండలి వివరణలో ఏజెన్సీ సంస్థ అంచనాలో లోపమని తెలిపింది? ఇందులో ఏది కరెక్టు అని భావిస్తున్నారు?

ఉత్తమ్ : గత ప్రభుత్వంలో చేసిన ఏజెన్సీనే ఇది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వాళ్లు చేసిన డిజైన్ లోపమో... లేదా నిర్మాణంలో లోపమో వల్లనో ఈ ఘటన జరిగింది. వాళ్ల(బీఆర్ఎస్)కు ఇంకొకర్ని విమర్శించే అర్హత లేదు. డిజైన్, కాంట్రాక్ట్, నిర్మాణం అంతా వాళ్ల టైంలోనే జరిగింది. కాబట్టి ఏది జరిగినా వాళ్లే బాధ్యత వహించాలి.

మీడియా: మీ ప్రభుత్వం వచ్చాక ఈ 9 నెలల్లో ఎప్పుడైనా సుంకిశాలపై సమీక్ష చేశారా?

ఉత్తమ్ : సుంకిశాల ప్రాజెక్టుపై ప్రభుత్వం సమీక్ష చేసి ఉంటుందనే అనుకుంటున్నా. నేను ఇరిగేషన్ మంత్రిని. నాకు దీనిపై అవగాహన లేదు.

ఈ పర్యటనలో రాష్ట్ర జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఏజెన్సీ డైరెక్టర్ సుదర్శన్, సుంకిశాల ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్, ప్రాజెక్టు సీజీఎం కిరణ్‌కుమార్, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ప్రాజెక్టు ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు ఉంతో ఉపయోగకరం: డైరెక్టర్

ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోకరమైనదని ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్ చెప్పారు. వరుసగా నాలుగేండ్లు కరువొచ్చినా హైదరాబాద్‌కు ఇప్పుంది లేకుండా నీళ్లు అందించవచ్చని అన్నారు. 'ప్రస్తుతం ఉన్న స్కీమ్(పుట్టంగండి)తో సాగర్‌లో ఎండీడీఎల్ లెవల్‌లో ఎమర్జెన్సీ పంపింగ్ చేసేవాళ్లం. ఇలాంటి సమస్య రాకుండా ఈ పథకాన్ని 1994లో అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. దీని నిర్మాణం సంక్లిష్టంగా క్రిటికల్ స్ట్రక్చర్‌తో ఉండటం వల్ల సాగునీటిని తాగునీటిగా ఇప్పటివరకు వాడుకుంటూ వస్తున్నం. కానీ తాగునీటికే ప్రత్యేక వ్యవస్థ ఉండాలన్న ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం సుంకిశాల ప్రాజెక్టును 2022లో ప్రారంభించింది. దీని పనులు కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు కేవలం తాగునీటి కోసమే ప్రత్యేకం. తీవ్ర వేసవిలోనూ ఎమర్జెన్సీ పంపింగ్‌తో పనిలేకుండా డెడ్‌స్టోరేజీ నుంచి కూడా నీళ్లు తీసుకోవచ్చు. నాలుగేండ్లు కరువు వచ్చినా ఇబ్బంది ఉండదు. సాగర్‌లో 450 ఫీట్ల వరకు డ్రా చేసుకోవచ్చు. ప్రస్తుతం 510 అడుగుల వరకే డ్రా చేయడానికి వీలు ఉంది' అని సుదర్శన్ వివరించారు.

పర్యవేక్షణ లోపమే కారణమా?

సుంకిశాలపై నిపుణుల అభిప్రాయం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): సుంకిశాల ప్రాజెక్టులో నిర్మాణ పనులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ లేకపోవడం వల్లనే రిటైనింగ్‌వాల్ కూలినట్టు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జలమండలి చేపట్టే ప్రతి ప్రాజెక్టుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగించుకుంటుంది. గతంలో శివారు మున్సిపాలిటీలలో హడ్కో రుణంతో చేపట్టిన రూ.1200 కోట్ల తాగునీరు, మురుగునీటి పారుదల ప్రాజెక్టు పనులు, మురుగునీటి శుద్ధి పనులపై క్షేత్రస్థాయి అధికారులపై ఆధారపడలేదు. పనులు జరుగుతున్న ప్రతి సైట్లలో సీసీ కెమెరాలను బిగించి ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలోని సెంట్రల్ సర్వర్‌కు అనుసంధానం చేశారు. రోజూ ప్రాజెక్టు డైరెక్టర్, ఎండీలు తమ చాంబర్‌లో ఏర్పాటు చేసిన బిగ్ స్క్రీన్ ద్వారా పనులను పర్యవేక్షించారు. తద్వారా పనుల నాణ్యతతోపాటు సంబంధిత ఎజెన్సీ లోపాలను పసిగట్టడం మందలించడం, చర్యలు తీసుకోవడం లాంటి వాటితో ప్రాజెక్టులను పూర్తి చేశారు. సుంకిశాల ప్రాజెక్టు పనుల్లో మాత్రం అధికారులు ఇవేవీ చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పెట్టుబడులు బోగస్

- సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన అట్టర్‌ఫ్లాప్
- రుణమాఫీ కాలయాపన కోసమే అమెరికా టూర్
- కుటుంబసభ్యులతోనే పెట్టుబడులు పెట్టించారు
- ఎన్ఆర్ఐ డాక్టర్ ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన అట్టర్‌ఫ్లాప్ అయిందని, పెట్టుబడులు అన్నీ బోగస్‌గా మారాయని ఎన్ఆర్ఐ డాక్టర్ ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ అమెరికా పర్యటనలో పాల్గొన్నవారిలో 90% మంది సీమాంధ్రులే ఉన్నారని దుయ్యబట్టారు. సీఎం అమెరికా పర్యటనలో తెలంగాణ పదానికి స్థానం కల్పించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మొదటి రోజు న్యూజెర్సీలో జరిగిన మీటింగ్‌లో తెలంగాణ వారు కానీ, మొదటి నుంచీ కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఒక్కరు కూడా లేరని చెప్పారు. హైదరాబాద్‌లోని రియల్‌ఎస్టేట్ దొంగలు మాత్రమే వచ్చారని పేర్కొన్నారు. సీఎం పర్యటనలో ఐటీ దిగ్గజాలను, పెద్ద ఫార్మా కంపెనీలను కలవలేదని దుయ్యబట్టారు. సీఎం తన కుటుంబసభ్యులతో కంపెనీలు పెట్టించి, రూ.1,000 కోట్లు, రూ.2,000 కోట్ల పెట్టుబడులు పెడితే లాభం ఏమిటని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డిది వ్యక్తిగత పర్యటన అని, స్నేహితులు, ఎన్నికల్లో సహాయం చేసినవారిని కలుసుకోవడానికి వచ్చారని మండిపడ్డారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు.. ఔన్నత్యం ఉన్న నాయకుడని, ఆయన ఇలాంటి సమావేశాలకు రాకూడదని పేర్కొన్నారు. పెట్టుబడుల కోసం వచ్చామనేది శుద్ధ అబద్ధమని పేర్కొన్నారు. రుణమాఫీపై కాలయాపనకే అమెరికా పర్యటన తలపెట్టారని విమర్శించారు. పంచాయతీ ఎన్నికల పేరు చెప్పి రుణమాఫీని వాయిదా వేస్తారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం ఎంత తొందరగా కూలిపోతే అంత ప్రజా రంజకంగా ఉంటుందని, తెలంగాణకు కేసీఆర్ శ్రీరామరక్ష అని పేర్కొన్నారు.

మా స్కూల్‌కు టీచర్లను నియమించండి ప్లీజ్

- తుక్కాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థుల వేడుకోలు
- పాఠాలు చెబుతున్న విద్యార్థులు



ఆత్మకూరు(ఎం), ఆగస్టు 9: అధికారులూ.. తమ పాఠశాలకు టీచర్లను నియమించి తమకు పాఠాలు బోధించాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం తుక్కాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వేడుకుంటున్నారు. తమ పాఠశాలలో గతంలో 33 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారని, తాజా బదిలీల్లో ఆ ఇద్దరూ ఇతర పాఠశాలలకు వెళ్లారని తెలిపారు. మరొక ఉపాధ్యాయురాలు ఇక్కడికి బదిలీపై వచ్చినా.. ఇటీవల ఆమె కూడా జూలై 29న పదోన్నతిపై తుర్కపల్లి మండలానికి వెళ్లారు. ఆ తర్వాత తమ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించలేదని, ప్రస్తుతం పాఠశాలలో 17 మంది విద్యార్థులం చదువుకుంటున్నామని, రోజూ బడికి వచ్చి ఏమీ నేర్చుకోకుండా వెళ్లిపోతున్నామని వాపోయారు. పాఠాలు చెప్పేందుకు ఉపాధ్యాయులు లేక విద్యార్థులే పాఠాలు చదువుకుని ఇంటి బాట పడుతున్నట్టు పేర్కొన్నారు. టీచర్లు లేక తమ పిల్లలు చదువుకు దూరమవుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని కోరుతున్నారు. ఉపాధ్యాయుల కొరత ఉండటంతో తుక్కాపురం ప్రాథమిక పాఠశాలకు టీచర్లను నియమించలేకపోతున్నామని ఎంఈవో శ్రీధర్ వివరించారు. ఈ సమస్యను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లామని, సాధ్యమైనంత త్వరగా తుక్కాపురం పాఠశాలకు ఉపాధ్యాయులను నియమిస్తామని చెప్పారు.

ఖమ్మంలో హెరాయిన్ కలకలం

మామిళ్లగూడెం, ఆగస్టు 9 : ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నుంచి 2.5 గ్రాముల హెరాయిన్‌ను ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. ఖమ్మం నగరంలోని రోటరీ నగర్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజులుగా అతడు డ్రగ్స్‌కు బానిసయ్యాడు. ఇటీవల ఖమ్మం నగరానికి వచ్చిన అతడు అస్సాం నుంచి 2.5 గ్రాముల హెరాయిన్‌ను పోస్ట్ ద్వారా తన ఇంటికి తెప్పించుకున్నాడు. కొద్ది రోజులుగా నిందితుడిపై నిఘా పెట్టిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పోస్ట్‌మెన్‌ను అనుసరించి.. నిందితుడు పార్సిల్ తీసుకోగా పట్టుకొని హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించగా.. ఇప్పటికే 10 నుంచి 15 సార్లు హెరాయిన్‌ను వివిధ మార్గాల్లో తెప్పించుకున్నట్టు ఒప్పుకున్నాడు.

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పోలీసు స్టేషన్ వద్ద మహిళను లాఠీతో కొడుతున్న ఏఎస్సై

మహిళ పై లాఠీతో ఏఎస్సై దౌర్జన్యం

మెట్‌పల్లి, ఆగస్టు 9: కొందరు పోలీసుల తీరు ఆ శాఖకే మచ్చ తెస్తున్నది. 'ఫ్రెండ్లీ పోలీస్' అనేది గాలికి వదిలేశారు. నోరు తెరిస్తే బూతులు తిడుతున్నారు. లాఠీలు, చేతులకు పనిచెప్పున్నారు. అందుకు జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం జరిగిన ఘటనే నిలువెత్తు నిదర్శనం. పట్టణంలోని మీనాక్షి దవాఖాన సమీపంలో అద్దెకు ఉంటున్న భార్యాభర్తలు గొడవపడి ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ మరోసారి ఇద్దరి మధ్య వాగ్వాదం జరగగా సర్దిచెప్పాల్సిన పోలీసులు భిన్నంగా వ్యవహరించారు. ఓ ఏఎస్సై లాఠీతో, మరో హెడ్‌కానిస్టేబుల్ చేతులతో ఆ మహిళపై విరుచుకుపడ్డారు. ఇది చూసిన పలువురు అవాక్కయ్యారు. ఒక వేళ ఆ మహిళది ఏమైనా తప్పుంటే కేసు పెట్టాలి. లేదా సర్దిచెప్పాల్సింది పోయి కొట్టడమేమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదు చేసేందుకు ఠాణాకు వచ్చే బాధితులపై దురుసుగా ప్రవర్తిస్తారనే ఆరోపణలు ఆ ఇద్దరిపై ఉన్నాయి.

జీవో 33 అవగాహన రాహిత్యమే

- తెలంగాణ విద్యార్థులకు తీరని అన్యాయం
- రేవంత్ సర్కార్‌పై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ధ్వజం

శుక్రవారం సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ) : 420 హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకపోగా కాంగ్రెస్ సర్కార్ అవగాహన రాహిత్యంతో జీవో 33ను తీసుకొచ్చిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతూ ఈ జీవో తెలంగాణ విద్యార్థులకు గొడ్డలిపెట్టు అని ఆందోళన వ్యక్తంచేశారు. పక్కన ఉన్న ఏపీకి ఆనుకొని ఉన్న ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుందని అన్నారు. గతంలో ఎక్కడా ఒక్క ఇబ్బంది లేకుండా బయటివారు ఇక్కడకు రాకుండా నిరోధించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం వరుసగా నాలుగేండ్లు ఇక్కడ చదివి ఉండటం కాదు గత ఏడేండ్లలో ఏ నాలుగేండ్లు ఇక్కడ చదివినా వారికి స్థానికత వస్తుందని తెలిపారు. కానీ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో సహచరుడు అధికారంలోకి వచ్చినందున అనాలోచితంగా ఏదైనా నాలుగు అనే పదాన్ని తీసేస్తూ జీవో తీసుకురావడం దారుణమని అన్నారు. వరుసగా నాలుగేండ్లు చదివితేనే అనే జీవో తెలంగాణకు, ప్రత్యేకంగా సరిహద్దు జిల్లాల వారికి నష్టం కలుగుతుందని చెప్పారు.

ఇప్పుడు వారంతా తెలంగాణలో ఎంబీబీఎస్‌లో సీటు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి విద్యార్థుల తల్లిదండ్రులు తెలంగాణ భవన్‌కు వస్తామని చెప్పారని, వారు వస్తే న్యాయం కోసం పోరాడాల్సిన ఉంటుందని అన్నారు.

ప్రపంచంలోనే ఎక్కడా నీళ్ల నిల్వపై సబ్‌కమిటీ లేదు

ప్రాజెక్టుల్లో నీళ్ల నిల్వపై క్యాబినెట్ సబ్‌కమిటీ వేయడం విచిత్రంగా ఉన్నదని జగదీశ్‌రెడ్డి అన్నారు. ప్రపంచంలో ఇప్పటి వరకు ఇలాంటి సబ్‌కమిటీ ఎక్కడా వేయలేదని గుర్తుచేశారు. కాళేశ్వరం పంప్‌హౌస్ నుంచి పంపింగ్ చేసి సాగునీరు అందించాల్సి ఉండగా దిగువ ప్రాజెక్టుల్లో నీళ్లు లేకున్నా పంపింగ్ జరుపడం లేదని దుయ్యబట్టారు. సుమారు 140 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉన్నా ప్రభుత్వానికి పట్టింపు లేదని, లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలైస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వరద పోయాక హడావిడి చేస్తే ప్రయోజనం ఏంటని ప్రశ్నించారు. ఎకరం ఎండినా ప్రభుత్వానిదే బాధ్యత అని హెచ్చరించారు. సుంకిశాల ప్రాజెక్టు వాల్ వారం రోజుల క్రితం కూలితే ప్రభుత్వం ఈ విషయాన్ని ప్రజలకు చెప్పకుండా ఎందుకు దాచి పెట్టిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రాజెక్టులకు నష్టం లేకుండా పూడిక తీయాలి

- సారవంతమైన మట్టి వస్తే రైతులకివ్వాలి
- 14 నాటికి సమగ్రమైన నివేదిక ఇవ్వండి
- అధికారులకు మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో పూడికతీతకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్టు మంత్రివర్గ ఉపసంఘం వెల్లడించింది. ప్రాజెక్టుల రక్షణలో రాజీపడొద్దని, వాటికి ఎలాంటి నష్టం లేకుండా పూడికతీత చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల్లో పూడిక తీత, నీటి నిల్వ సామర్థ్యం పునరుద్ధరణ తదితర అంశాలపై అధ్యయనం జరిపి, ప్రభుత్వానికి తగిన సిఫారసులు చేసేందుకు ఇటీవల మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించిన విషయం తెలిసిందే. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు సభ్యులుగా ఉన్న ఈ ఉపసంఘం శుక్రవారం సచివాలయంలో ప్రత్యేకంగా సమావేశమైంది. ఇరిగేషన్, గనులు, భూగర్భ శాఖల ఉన్నతాధికారులతో పలు అంశాలపై చర్చించింది. పూడికతీతపై రెండు విభాగాలు సమావేశమై నిర్ణయానికి రావాలని స్పష్టం చేసింది. పూడికతీత ద్వారా సారవంతమైన మట్టి లభిస్తే రైతులకు ఉచితంగా ఇవ్వాలని, అందుకు సంబంధించిన రవాణా చార్జీలను రైతులే భరించేలా విధివిధానాలను రూపొందించాలని దిశానిర్దేశం చేసింది. పూడికతీత ద్వారా వచ్చిన మట్టి, ఇసుకను ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన ఇతర నిర్మాణాలకు వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని, ఈ అంశాలపై ఈ నెల 14 నాటికి సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశించింది. సమావేశంలో ఇరిగేషన్ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, సహాయ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సలహాదారుడు ఆదిత్యా దాస్, మైన్స్ అండ్ జియాలజీ విభాగం కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ సుశీల్ కుమార్, ఈఎన్సీ అనిల్ కుమార్, డిప్యూటీ ఈఎన్సీ కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెండో పెండ్లికి సిద్ధమైన భర్త పరుగో పరుగు

- భార్యకు తెలియకుండా తిరుమలలో వివాహ ఏర్పాట్లు
- సమయానికి మండపంలోకి మొదటి భార్య ఎంట్రీ
- పీటల మీది నుంచి జారుకున్న వరుడు, కుటుంబ సభ్యులు
- తిరుమల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు.. కేసు నమోదు

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): భార్యకు తెలియకుండా రహస్యంగా రెండో పెండ్లి చేసుకోవాలనుకున్న భర్త.. హైదరాబాద్ నుంచి తిరుమలకు వచ్చి మరీ ఏర్పాట్లు చేసుకున్నాడు. కానీ.. అకస్మాత్తుగా భార్య ఎంట్రీ ఇవ్వడంతో అతని ప్లాన్ బెడిసికొట్టింది. భర్త కుట్రను ముందే తెలుసుకున్న భార్య.. తన కుటుంబసభ్యులతో కలిసి పెండ్లి సమయానికి కల్యాణ మండపానికి చేరుకున్నది. దీంతో వరుడు పెండ్లి పీటల మీది నుంచి మెళ్లగా జారుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం తిరుమలలో కలకలం సృష్టించింది. హైదరాబాద్‌కు చెందిన రాకేశ్‌కు హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాలకు చెందిన సంధ్యతో వివాహమైంది. వారికి ఏడేండ్ల కుమార్తె కూడా ఉంది. రాకేశ్ సంధ్యకు విడాకులు ఇవ్వాలని అనుకున్నాడు. కోర్టులో విడాకుల కేసు నడుస్తున్నది. అయినా.. మొదటి భార్యకు తెలియకుండా రెండో పెండ్లికి సిద్ధమయ్యాడు. శుక్రవారం ఉదయం తిరుమలలోని గోగర్భం డ్యామ్ వద్ద ఉన్న ఓ మఠంలో రెండో పెండ్లి చేసుకోబోయాడు. ఈ విషయం తెలుసుకున్న సంధ్య తన కుమార్తె, కుటుంబసభ్యులతో కలిసి సమయానికి కల్యాణ మండపానికి చేరుకుంది. సంధ్య కల్యాణ మండపం వద్దకు రావడాన్ని గమనించిన రాకేశ్, అతని కుటుంబ సభ్యులు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో అక్కడ ఉన్న కొంతమందిని సంధ్య కుటుంబ సభ్యులు పట్టుకుని తిరుమల పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. తనకు న్యాయస్థానం ఇంకా విడాకులు మంజూరు చేయలేదని.. తన భర్తతో ఉండేందుకు కోర్టు తనకు అనుమతి ఇచ్చిందని సంధ్య తెలిపారు. రాజకీయ నాయకుల అండదండలతో భర్త తనను ఇంటి నుంచి తరిమేశాడని వాపోయింది. భర్త రెండో పెండ్లికి సిద్ధమయ్యాడని తెలుసుకుని తిరుమలకు వచ్చి ఆపానని చెప్పింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

లాయర్లను కొట్టిన పోలీసులను డిస్మిస్ చేయాలి

- ఎమ్మెల్యే పల్లా డిమాండ్
- నాపైనా కేసులు పెట్టి వేధిస్తున్నారని వెల్లడి

జనగామలో న్యాయవాదుల దీక్షకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): జనగామలో న్యాయవాద దంపతులపై దాడి చేసిన సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సై తిరుపతి, తదితర పోలీసు సిబ్బందిని బదిలీ చేసి చేతులు దులుపుకోకుండా బాధ్యులైన వారిని ఉద్యోగం నుంచి తొలగించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన నిరాహార దీక్షా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసులే దొంగలుగా మారి ప్రజలను పీల్చి పిప్పిచేస్తున్నారని ధ్వజమెత్తారు. న్యాయవాద దంపతులపై పోలీసులు చేసిన దాడిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని, వారి దీక్షకు మద్దతు తెలుపుతున్నదని, న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటుందని స్పష్టంచేశారు. ప్రజలకు భద్రత కల్పించాల్సిన పోలీసులు లంచాలకు మరిగి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఒక ఎమ్మెల్యేగా తనపైనే నాలుగు అక్రమ కేసులు పెట్టి పోలీసులు వేధిస్త